
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





# -51-

## అమెరికాంధ్రా అమ్మాయి పెళ్ళి కథ

**క్రిందటి నెల**..అంటే మే నెల 8 వ తారీకున మా పెద్దమ్మాయి పెళ్లి అమెరికా అబ్బాయి తో జరిగింది. నేనూ, మా క్వీన్ విక్టోరియా శాస్త్రోక్తంగా పీటల మీద కూచుని, ఆ కుర్రాడి తెల్లటి పాదాలు కడిగి కన్యాదానం చేసి, జీల కర్రా బెల్లం పెట్టించి తలంబ్రాలతో సహా మన పద్ధతి లోనే పెళ్లి చేశాం. దీన్ని కోవిడ్ పెళ్లి అనవచ్చును. ఎందుకంటే ఏడేళ్ళ క్రితం జరిగిన మా రెండో అమ్మాయి పెళ్లి శ్రీ మీనాక్షీ దేవాలయంలో చేసినప్పుడు సుమారు 800 మంది వచ్చారు. ఇండియా నుంచి మా అత్త గారు, బావ మరిది, మా అన్నయ్య, వదిన, వంశీ రామరాజు & సుధ గారూ, అమెరికాలో ఉన్న అందరు బంధువులూ, మిత్రులూ వచ్చారు. ఈ సారి ఆ పప్పులు ఉడక లేదు.

అసలు ఏం జరిగిందంటే.. మొన్నటి శీతాకాలంలో మా ఇంట్లో కరెంటూ, దాంతో ఇంటి హీటరూ కూడా పనిచెయ్యడం మానెయ్యడం, ఉష్ణోగ్రత బయటా, లోపలా ఒళ్ళంతా గడ్డకట్టుకు పోయేలా సున్నా డిగ్రీలలో ఉండడంతో మా కాకినాడ మామిడి కింద కూచుంటే ఎంత బావుండునో, వెధవ అమెరికా అని పదే పదే అనుకున్నాం. ఇక ఒకర్నొకరు వాటేసుకునే వయస్సు కాదు కాబట్టి సోఫాలో నేనూ, మా క్వీన్ విక్టోరియా చెరో మూలా పదేసి దుప్పట్లు, రొజాయిలు (ఎన్నాళ్ళయిందో ఈ మాట విని, కదా) కప్పేసుకుని, ప్రాణ వాయువు లేక నల్లగా మాడిపోయిన టీవీ డబ్బా కేసి చూస్తూ ఉసూరుమనుకుంటూ ఉండగా నాకు కళ్ళెదురుగుండా ఒకానొక "ఇంటి కుంపటి" అనగా ఫైర్ ప్లేస్ కనపడింది. దీని కర్తవ్యం ఏమిటంటే....ఆ కుంపటి వెలిగించినప్పుడు మేము కూచున్న గదిని వేడి చెయ్యడం. కాస్త వేడి రాష్ట్రమైన మా టెక్సస్ లో అలంకారం కోసమే కానీ వాడవలసిన అవసరం ఎక్కువ రాదు. అంచేత గత ఇరవై ఏళ్ళలోనూ ఆ కుంపట్లో పిల్లి లేవ లేదు. నేను దాన్ని వెలిగించ లేదు. ఇప్పుడు హఠాత్తుగా అది నిద్ర మొహం వేసుకుని కనపడగానే, నాకు మెళకువ వచ్చి, ఆయా దుప్పట్లని పక్కకి విసిరేసి, లేచి ఆ ఫైర్ ప్లేస్ దగ్గరకి వెళ్ళి దాన్ని ఎలా వెలిగించాలా అని కూలంకషంగా పరిశీలించాను. అంటే...ఒక ఐదు నిముషాలు పరిశీలించడం, అర్థం కాక, చలి ఎక్కువై పోయి, మళ్ళీ సోఫా మీదకి వెళ్ళి

విసిరేసిన రొజాయిలు (ఎన్నాళ్ళయిందో కదా నిజం రొజాయి కప్పుకుని) మళ్ళీ కప్పుకుని ఆలోచించడం....ఇదంతా ఎందుకంటే ఈ దిక్కుమాలిన ఫైర్ ప్లేస్ ఏదో మామూలు కుంపట్లో నాలుగు కట్టెలు పడేసి, కాస్త పెట్రోలు పోసి, అగ్గి పుల్ల గీసి వెలిగించే బాపతు దేశవాళీ సరుకు కాదు. ఇదేదో హై టెక్కు అని ఇరవై ఏళ్ళ క్రితం బుద్ధి లేక పెట్టించుకున్నాం. కున్నాం ఏమిటి లెండి. "మనకెందుకు ఇంత టెక్కు. అగ్గి పెట్టెలూ, కట్టె ముక్కలూ చాలవూ" అంటూనే ఉంది మా క్వీన్ విక్టోరియా. అంటే...ఇందులో పైకి షోగ్గా అచ్చు నిజమైన కట్టెల్లా కనపడే నాలుగు పెద్ద సిమెంటో మరేదో పుల్లలు పేర్చి ఉంటాయి. ఎక్కడో కనపడకుండా వంట గేస్ తో మంటలు వచ్చే ఏర్పాటు ఉంటుంది. మనం చూస్తుంటే ఆ దొంగ కట్టెల మండుతూ ఉండగా నిజంగా కట్టెల మంటలు వస్తున్నట్టు ఫీలింగ్ కోసం అనమాట. గేస్ మంట కాబట్టి వేడి వస్తూ ఉంటుంది. ఇక అవేవీ మనం ముట్టుకుని చెయ్యి కాల్చుకోకుండా ఒక గ్లాసు పలక బిగించేసి ఉంటుంది. దాన్ని వెలిగించ లేక ఇప్పుడు ఎంకి పెళ్ళి సుబ్బి చావు కొచ్చింది.

ఇంతకీ మీ అమ్మాయి పెళ్ళికీ, ఈ "ఇంటి కుంపటి" టి కీ లంకె ఏమిటీ అంటే...అదిగో అక్కడికే వస్తున్నాను.

"నీకెలా రాదు కానీ, ఉండు, దేవిడ్ ని పిలుస్తాను" అని మా పక్కింటి దేవిడ్ ని పిలవగానే వాడూ నేను ఊళ్ళో లేను. మా మనవరాలి ఇంట్లో చలికాచుకుంటున్నాను" అని చెప్పగానే "మనమ్మాయిని పిలు. దానికి చాలా మంది ఫ్రెండ్స్ ఉన్నారు. ఎవడో ఒకడికి ఇది తెలిసి చస్తుంది. నీ ఫ్రెండ్స్ అందరూ సాహిత్యం గాళ్ళే. పనికి రారు"....నిజానికి "ఎందుకూ పనికి రారు" అని ఆవిడ వాడిన మాట వాళ్ళకి తెలియకుండా ఇక్కడ చెప్పేస్తున్నాను.

ఆవిడ చెప్పినట్టు మా అమ్మాయిని పిలవగానే పాపం అంత చలి లోనూ ఆ సాయంత్రం ఓ అమెరికన్ కుర్రాడిని వెంటబెట్టుకుని వచ్చింది. అతను ఇది వరకూ చాలా సార్లు మా ఇంటికి వచ్చిన వాడే. రాగానే "ఈ ఫైర్ ప్లేసుల గురించి నాకూ అస్సలు తెలీదు. నేను కంప్యూటర్ వాడిని. అయినా చూద్దామ్ అని వచ్చాను" అనేసి ఆ ఇంటి కుంపటిని పరిశీలించడం మొదలుపెట్టాడు. అప్పుడు నేను అతడిని పరిశీలించినప్పుడు నాకంటే అతను అస్సలు ఒక్క రొజాయి కూడా కప్పుకోలేదు అని గమనించి, అస్సలు అతనికి ఒళ్ళంతా గర గరా గుచ్చుకునే ఆ కాష్మీరీ రొజాయిల గురించి అతనికి తెలుసునా అని అనుమానం వచ్చింది. ఎంతయినా తెల్ల తోలు కాబట్టి చలి భరాయించె శక్తి మనకంటే ఎక్కువే అని అర్థం చేసుకున్నాను. ఆశ్చర్యం ఏమిటంటే...ఈ దొంగ కుంపటి తయారు చేసిన వాడి ఊరూ, పేరూ, ఫోన్ నెంబరూ, దాని సీరియల్ నెంబరూ, తయారు చెయ్యబడిన చైనా వల్లకాడూ, నాకు అమ్మబడిన అమెరికా వసినపురం వగైరా వివరాలు ఉన్న ఒక పతకాన్ని ఈ అబ్బాయి ఆ ఫైర్ ప్లేస్ లో కనిపెట్టి ఇక విజృంభించి, వాళ్ళని పిలిచి, మర్రి చెట్టు తొర్ర లో చిలక ప్రాణం రహస్యాన్ని కనిపెట్టి ఆ ఫైర్ ప్లేస్ ని వెలిగించాడు. 'శభాష్ బిడ్డా' అని ఆ బిడ్డ సంగతులు ఆరా తీయగా, తీయగా....ఒకటి తర్వాత ఒకటిగా ఆ కుర్రాడు మా అమ్మాయికి వరుడిగా స్థిర పడ్డాడు. "హమ్మయ్య. ఇప్పటికి సరి అయిన హేండీమేన్ దొరికాడు" అంది మా క్వీన్ విక్టోరియా. ఇంట్లో చిన్న చిన్న రిపేర్లు చేసేవాళ్ళని హేండీమేన్ అంటారు.

ఇక పెళ్ళి కుదిరాక మొదటి నిర్ణయం–ఎప్పుడూ? ఈ నిర్ణయానికి చాలా తతంగాలు ఉన్నాయి. మన పద్ధతి ప్రకారం ముహూర్తం పెట్టించాలి అంటే మరి మన అమెరికన్ పెళ్ళి కుమారుడి జాతకం దొరకాలి కదా!. నేను సమాధానం ముందే ఊహించగలిగినా "నీ జాతకం ఉందా?" అని అడగగానే ఆ కుర్రాడు వెర్రి మొహం పెట్టి "బర్త్ సర్టిఫికేట్ ఉంది. అది ఇవ్వకుండా అమెరికాలో ఆసుపత్రి నించి బయటకి రానివ్వరు" అన్నాడు. అది తెప్పించి, మా అమ్మాయి జాతకం జోడించి మా సామర్లకోట ఏస్ట్రో ప్రసాద్ కి పంపించి మూడు ముహూర్తాలు పెట్టించాను. ఈ మూడూ కూడా మా మూడు నిబంధనల కి సరిపోయేలా..అనగా...ఖచ్చితంగా శని, ఆది వారాలే ఉండాలి. తెల్లవారు ఝామున రెండు గంటల పన్నెండు నిముషాల ముహూర్తాలు కుదరవు. పొద్దున్న పది దాటాక ఉండాలి. మూడు, నాలుగు నెలల తర్వాత ఉండాలి. పాపం ఆయన కష్టపడి మూడు ముహూర్తాలూ పెట్టి, ఆఖర్న "అబ్బాయి అమెరికనా?" అని అడిగాడు. ఎందుకంటే నేను వరుడి పుట్టిన తేదీ, సమయమూ, ఊరూ వగైరా సమాచారం ఇచ్చాను కానీ ఆ కుర్రాడి పేరు రాయడం మర్చిపోయాను. "ఉద్ధరించావ్" అంది మా క్వీన్ విక్టోరియా. ఇక్కడ నీతి ఏమిటంటే...మన జాతకములు అందరికీ వర్తించును. ముహూర్తం పొద్దున్న 11:54 కి అని చెప్పగానే మా కాబోయే అల్లుడి కి అది హాయిగా 11:30 నుంచి 12:00 ఎందుకు కాదో అంత నిముషాల మీద సరిగ్గా 11:54 కే "చంపగ్నె" ఎలా తాగవలెనో. లేక కేకు ఎలా కత్తిరించ వలెనో తెలియక, అలారం పెట్టుకోవాలా అని నన్ను అమాయకంగా అడిగినప్పుడు నేను విజృంభించి "జీల కర్ర బెల్లము" అనే అంశం మీద ఉపన్యాసం ఇచ్చాను. దానికి డంగై పోయి ఆ తర్వాత పెళ్ళికి ముందు మూడు వారాలూ, అయ్యాక వారం అయినా కూడా అతను నా జోలికి రాలేదు. అదెందుకు, ఇదెందుకు అని అడిగితే ఒట్టు. ఆఖరికి పెళ్ళి పీటల మీద బ్రహ్మ గారు "ఏదీ కెన్ యు డు ఆచమనం. షో మి" అనగానే నాకేసి దీనంగా చూసి బుద్ధిగా అర చెయ్యి ముడిచి పంచపాత్రలో నీటిని ఉద్ధరిణి తో వేసుకుని కిక్కురుమనకుండా తాగేశాడు.....మూడు సార్లు.

పెళ్ళి చెయ్యడం లో మాకు వచ్చిన అతి పెద్ద ఇబ్బంది ఈ దిక్కుమాలిన కోవిడ్. మా ఇంటికి దగ్గరలోనే ఉన్న ఒక కల్యాణ మండపం...దాని పేరు సఫారి టెక్సస్ రాంచ్.....పెళ్ళి కాబట్టి కల్యాణ మండపం అంటున్నాను...గమనించగలరు. అక్కడ ఆరుబయట...అయినా కూడా కోవిడ్ వలన 125 మంది కంటే ఎక్కువ మందిని పిలవ కూడదు అని వాళ్ళు నిబంధన పెట్టారు. దాంతో తర్జన భర్జన పడి కేవలం వధూవరుల దగ్గర స్నేహితులు, మా దగ్గర బంధువులని మాత్రమే పిలవాలి అనే నిర్ణయానికి వచ్చాం. మాకు తెలిసిన ఒకరా.....ఇద్దరా... అనేక మంది ఆత్మీయులని ఆహ్వానించి పండగ చేసుకోలేకపోతున్నామే అనే బాధ ఎప్పటికీ ఉండేదే. మరీ ముఖ్యంగా,,ఏడేళ్ళ క్రితం మా రెండో అమ్మాయి పెళ్ళి కి కుటుంబ సమేతంగా సహాయం చేసిన పది, పదిహేను మంది స్నేహితులని కూడా పిలవ లేక పోవడం మరీ బాధగా ఉంది. కానీ అందరి క్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకోవలసి వచ్చింది.

అయితే ఇక్కడో ఓ తమాషా జరిగింది. అప్పుడప్పుడు పలకరించుకునే మా పక్కింటి డేవిడ్ కి మా అమ్మాయి పెళ్ళి కుదిరిన సంగతీ, కోవిడ్ వలన ఎవరినీ..ఆఖరికి అతడినీ కూడా పిలవడం లేదు అని ఒకటికి రెండు సార్లు చెప్పాను. తీరా పెళ్ళి నాడు, ముహూర్తం అయ్యాక విందు భోజనం సమయం లో సూటూ, బూటూలతో డేవిడూ, 



భలే ముస్తాబైన అతని భార్యా రసమలై తింటూ కనపడ్డారు. నేను ఆశ్చర్యంగా "నువ్వెలా వచ్చావ్?" అని అడిగేశాను. "యువర్ వైఫ్ ఇన్ వైటెడ్ మి" అని వాడు గులాబ్ జామ్ తెచ్చుకోడానికో, పెళ్ళానికి తేడానికో వెళ్ళిపోయాడు. ఆ తర్వాత మా సతీమణి కనపడినప్పుడు "నువ్వు డేవిడ్ ని పిలిచావా?" అనగానే "నీకు లేక పోతే నాకు లేదా? "ఇరవై ఏళ్ళగా పక్కింటి వాడు కదా...అప్పుడు ఊళ్ళో లేడు కానీ ఆ ఫైర్ ప్లేస్ వాడే వచ్చి ఫిక్స్ చేసే వాడు" అంది మా క్వీన్ విక్టోరియా.

ఇక్కడ అప్రస్తుతమే కానీ, ఈ అమెరికా ముస్తాబుల మీద నా 'అమూల్యమైన' అభిప్రాయం చెప్పాలి. మొన్నటి పెళ్ళి లో మంగళ సూత్రం, సప్తపదులతో సహా మొత్తం పెళ్ళి తంతులు అన్నింటికీ నాలుగు గంటలు పడితే, ఈ మేకప్ తతంగానికి ఏడు గంటలు పట్టింది. ఇక గౌరీ పూజకి నేను పీటల మీద కూచున్నాక నా పక్కన ఎవరో వచ్చి కూచుంటే "లే, లే, తప్పు. తప్పు. ఇక్కడ మా ఆవిడ కూచోవాలి" అని నేను లేచిపోబోతూ ఉంటే ఆవిడ ఒహటే నవ్వు. తీరా ఆ నవ్వు చూస్తే ఆవిడ మా అవిడే...విత్ మేకప్. అసలు గుర్తుపట్ట లేక పోయాను. అలాగే మా అమ్మాయి కూడా. సహజంగా బాగానే ఉండే మన భారతీయ వనితలకి ఈ మేకప్పులూ, పెయింటింగులూ అంతగా అవసరమా అనేదే నా అప్రస్తుత్త ప్రసంగం. కొంత మందిని 'మేకప్ లేకుండా చూడలేమ్ బాబూ' అనే నానుడీ మనం వినేదే!.

ఇక పెళ్ళి అయిన మర్నాడు మా క్వీన్ విక్టోరియా హడావుడిగా వంటింటి నుంచి పొట్లాలు కట్టేసి మా ఎదురింటి వాళ్ళకీ, అటు పక్క ఇళ్ళ వాళ్ళకీ పెరుగు వడలూ, సాంబారూ, కూరా వగైరాలు పంచిపెట్టేస్తూ ఉంటే నేను విస్తుపోయాను.



"అసలు ఏం జరుగుతోంది, ప్రేయసీ" అని ఆ సమయం లో చెయ్యకూడని పద ప్రయోగం చేశాను. అప్పుడు ఆమె చూసిన చూపే కాక చెప్పిన సమాధానం కూడా ముందు నాకు అర్థం కాలేదు "నా మొహం జరుగుతోంది"....మొహం జరగడం ఏమిటీ? ఇంతకీ జరిగిందేమిటీ అంటే....సఫారి టెక్సస్ లో వివాహ భోజనం లో మిగిలిన అన్ని పదార్ధాలూ ఒక్కొక్క పెద్ద పెద్ద అల్యూమినియం పళ్ళాలలో పెట్టి మాకు ఇచ్చేశారు. అవి ఇంటికి పట్టుకొచ్చేశాం. ఇవన్నీ ఎవరు తింటారురా బాబోయ్ అనుకుంటున్న సమయం లో మా ఎదురింటి విలియమ్ వాడు మా ఇంటికి ఫోన్ చేశాడు. "ఇప్పుడే డేవిడ్ ఫోన్ చేశాడు. మీ అమ్మాయి పెళ్ళి భోజనం చాలా బావుందిట. చాలా మిగిలి పోయిందిట అని. మాకేమన్నా ఇస్తారా? మీకు తెలుసుగా. మాకు ఇండియన్ ఫుడ్ అంటే ఇష్టం అనీ" అదీ ఆ ఫోన్ సారాంశం. దాంతో మా ఆవిడ రొట్టె విరిగి నోట్లో పడినట్టు అయింది. ఇక రెచ్చి పోయి, మా చుట్టుపక్కల ఇళ్ళ వాళ్ళందరికీ ఆ వివాహ భోజనం పొట్లాలు కట్టేసి, పంచిపెట్టేసి, నాకు మిగల్చకుండా తన పతి భక్తి నిరూపించుకుంది మా క్వీన్ విక్టోరియా!. సరిగ్గా అదే సమయం లో మా గడ్డి కొయ్యడానికి వచ్చిన హొజె గాడి జాతకం కూడా బావుంది. వాడి ఇంటిల్లిపాదికీ వారానికి సరిపడా భారత భోజనం వడ్డించేసింది మా ఆవిడ. నేను క్రిస్ మస్ బోనస్ గా వంద డాలర్లు ఇచ్చినప్పుడు కూడా వాడి మొహం లో ఇంత ఆనందం చూడ లేదు. లెఫ్ట్ ఓవర్ అయినా సరే...మన సాంబార్ క్రిస్ మస్ బోనస్ కన్నా ఎక్కువ పవర్ ఫుల్ అనమాట. అనకూడదు కానీ ఆ విధంగా "పని" వాళ్ళకి భోజనాలతో సహా మా అమ్మాయి పెళ్ళి బాగానే జరిగింది.

మా అమ్మాయి పెళ్ళి ఫొటోలు ఫేస్ బుక్ లో పెట్టి చాలా లైకు లే కొట్టించుకున్నాను. ఇక్కడ శాస్త్రానికి రెండు మాత్రమే పెట్టాను. ఈ కథ లో సంగతులు కొన్ని నిజం, చాలా మటుకు అతిశయోక్తులు, కొన్ని కల్పితాలు, అన్నీ సరదా కోసమే అని గ్రహించగలరు.

**COMMENTS**